# ఈ పీకుడేందిరో

"నమస్కారం డాక్టర్‌గారూ! మా అయన బాత్‌రూమ్‌లో ఉన్నారండి!"

"ఏం ఫర్వాలేదు. నేను లైన్‌లో ఉంటాను. ఓసారి అయన్ని పిలవండి" ఈ రోజు ఎలాగైనా ఈ పీకుడు విషయం తేలిపోవాలి అనుకున్నారు డెంటల్ డాక్టర్.

"ఏవండీ! మీకే ఫోన్! పళ్ళ డాక్టర్ లైన్లో ఉన్నారు! త్వరగా వచ్చి ఈ ఫోన్ తీసుకోండి!" అంది శ్రీమతి శ్రీకాంత్.

'లేనని చెప్పకపోయావా!'

"నాలుగు రోజులు బట్టి యింట్లో లేరనీ, ఒక్కొక్కసారి బాత్‌రూమ్‌లో ఉన్నారనీ చెపుతున్నాను".

"ఏమిటమ్మా! మీవారు నేను ఫోన్ చేసినప్పుడల్లా బాత్‌రూమ్‌లోనే ఉంటున్నారు! మీ బాత్‌రూమ్ అంత బావుంటుందా!" అని నిన్న వెటకారమాడారు డాక్టర్‌గారు.

సరే! ఇక తప్పదని ఫోన్ తీసుకుని 'నమస్కారం' డాక్టర్ అన్నాడు శ్రీకాంత్.

"ఏమిటి! మీకెన్నిసార్లు చెప్పినా ఆ రెండు పళ్ళూ పీకించుకోవడం లేదు! మీ ఆవిడకి నాలుగు పళ్ళు, నా పట్టకారుతో కారు చవకగా పీకి పెట్టాను. మీకు నా యెడల విశ్వాసం లేనట్లుంది! ఆవిడ కట్టుడు పళ్ళతో యింట్లో కూర్చుని, మీ సంపాదన లక్షణంగా తింటూంటే మీ పళ్ళ బాధవలన, మీరు తినలేకపోవడం, నాకైతే చాలా బాధగా వుంది. ఇక తాత్సారం చేయకుండా వెంటనే వచ్చి మీ పళ్ళు పీకించుకుని, "బుద్ధిమంతుడు" అనిపించుకోండి".

"అదికాదు డాక్టర్! మొన్ననే నా శ్రీమతి పళ్ళకి పాతికవేలు ఖర్చు పెట్టాను కదా అని ఆలోచిస్తున్నాను".

"పళ్ళు పీకుతున్నాయని మీరే కదా బాధాకరమైన మొహంతో చెప్పారు! డబ్బు ఒక్కసారి యివ్వలేకపోతే వాయిదాల పద్ధతి మీద ఇవ్వండి, లేకపోతే తర్వాత ఎప్పుడైనా యింకో రెండు పళ్ళు పీకించుకున్నప్పుడు, అదీ యిదీ కలిపి ఇవ్వండి". ఎలాగైనా మీ రెండు పళ్ళూ పీకడం మాత్రం తథ్యం!"

"సరే డాక్టర్! వాయిదాల పద్ధతి మీద ప్రతినెల పదో తారీఖు లోపున యిచ్చేస్తాను. వడ్డీ మాత్రం యివ్వలేను. ఎవరైనా ష్యూరిటీ వుండాలా!"

"ఛ ఛ! మీ పళ్ళని బట్టి మీ నిజాయితీ తెలుసుకోగలను. ష్యూరిటీ వద్దు, గిర్టీ వద్దు!" అన్నారు డాక్టర్.

వారం రోజులు గడిచినా శ్రీకాంత్ డాక్టర్ని కలవలేదు. డాక్టర్ చాలా పట్టుదల మనిషి. మళ్ళీ ఫోన్ చేశాడు. ఫోన్ చేసింది డాక్టరని తెలీక శ్రీకాంత్ ఫోన్ తీసి దొరికిపోయాడు.

డాక్టర్ రీతి తప్పకుండా తగులుకున్నాడు. "మిస్టర్ శ్రీకాంత్, మీ పద్ధతి నాకేం నచ్చలేదు! ష్యూరిటీ అక్కర్లేకుండా డబ్బు వాయిదాల పద్ధతి మీద ఇమ్మన్నా, మీరు వచ్చి పళ్ళు పీకించుకోలేదు! ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం పళ్ళు అన్నీ అయిపోయి, యిక మీ పళ్ళే పీకుతున్నాననుకుంటున్నారా! నాకు కాని కోపం వస్తే మనిషి నిద్రపోతుండగా కూడా, నోటిలో బోటు పెట్టి, పళ్ళు పీకి, అతన్ని నిద్రలేపి పళ్ళు చేతిలో పెట్టగలను. నాకు రావలసిన డబ్బు పోయినా ఫర్వాలేదు, ఖబడ్దార్! పళ్ళు పీకకుండా కాలం వృథా చేసుకుని, నా చదువు వృథా చేసుకునే మనిషిని కాను! తోటి మానవుడిగా యివ్వన్నీ అర్థం చేసుకుని, నాచేత "బుద్ధిమంతుడు" అనిపించుకున్నారా సరే సరి, లేకపోతే ఏం జరుగుతుందో మీకే తెలుస్తుంది!"

"సారీ డాక్టర్! మీ మనస్సు నొప్పించినట్లున్నాను. "మీ పంటి నొప్పి ముందు నా మనస్సు నొప్పి ఎంత!" ఆ! అన్నట్లు మీకొక శుభవార్త. మొన్న ఓ అడపడుచు తన భర్తని తీసుకువచ్చి అయన రెండు పాకుడు పళ్ళు పీకించేసింది. తర్వాత వచ్చి నా ఫీజుతో పాటు ఓ రెండు వందలు బహుమానం యిచ్చి, "అబ్బ డాక్టర్ మీ మేలు ఈ జన్మలో మరువలేను! ఆ పాకుడు పళ్ళు బయట పడేటట్లు మా ఆయన నవ్విన వెకిలి నవ్వులు చూడలేక యిన్నాళ్ళూ చచ్చాను. ఇప్పుడు ఆయన బోసినవ్వులు చూస్తూ ఆనందిస్తున్నాను అంది. తర్వాత రెండు పళ్ళూ కట్టేశాను. ఆ వ్యక్తి నవ్వుతూ, తన భార్యని ఆ నవ్వులతో కట్టిపడేస్తున్నాడట. ఆవిడ "నవ్వులా అవి నవపారిజాతాలు" అని పాడుకుంటూ, పరవశించి పోతోంది!"

"ఇన్నాళ్ళూ పాకుడు రాళ్ళు గురించి విన్నాం! అయితే పళ్ళలో "పాకుడు పళ్ళు" కూడా వుంటాయన్నమాట" అనుకుంటూ "నే తప్పకుండా వస్తాను" అని ఫోన్ పెట్టేసే లోపున "చాలా థాంక్స్! రేపొచ్చి హాయిగా నా డెంటల్ కుర్చీలో, ఇంట్లో వాలు కుర్చీలో పడుకున్నట్లు పడుకోండి నే పీకుతాను కదా మీకెందుకు! మీరు మాత్రం "అయ్యో! అబ్బో అమ్మో అనకండి!" అన్నారు డాక్టర్.

"ఏమిటి అంతసేపు మాట్లాడారు! పళ్ళు పీకించుకోవడానికి రమ్మనేనా! మనిషి దగ్గర కొచ్చినప్పుడు పీకి పారెయ్యాలి కాని "మాట్లేస్తాం మాట్లేస్తాం" అన్నట్లుగా "పళ్ళు పీకుతాం" "పళ్ళు పీకుతాం" అంటే జనం వస్తారా! ఈ ఫోన్ బిల్స్ పెరిగిపోయి అవి కట్టకపోతే పళ్ళు పీకడం ఏమోగాని, ఈ ఫోన్ కాస్తా పీక్కుపోతారు. ఆ టెలిఫోన్ డిపార్టుమెంట్ వాళ్ళు" అంది డాక్టర్‌గారి శ్రీమతి.

"నువ్ చూస్తూండు! ఇప్పుడు నేను మాట్లాడినతని పళ్ళు పీకకపోతే నేను మగ డాక్టర్నే కాదు!"

"సర్లేద్దురూ! పెళ్ళయినప్పట్నుంచి మీ పళ్ళ ప్రగల్భాలు వింటూనే వున్నాను! మీరు

డెంటల్ కోర్సు చదువుకునేటప్పుడు గోడమీదున్న ఓ మేకు పీకలేక చేతిలోని పట్టకారుతో సహా వెనక్కి భళ్ళుమని పడ్డారుట కదా!"

"ఈ విషయం ఎవరు ఊదారు నీ చెవిలో! ఒకసారి మేకు పీకలేకపోతే యిక అంతేనా! అసలు ఆ పట్టకారు సరియైనది కాదు! నా పేషంట్లంతా నన్ను "నోరు తెరవమంటే తెరుస్తారు. మూయమంటే మూస్తారు నీ గయ్యాళి నోరు మాత్రం మూయించలేకపోతున్నాను".

"అసలు నాకు తెలీక అడుగుతున్నాను! మా నాన్న దగ్గర అంత కట్నం పీక్కున్నది నా నోరు మూయించడానికా! కట్నం పీకడంలో మీ వాళ్ళకున్న ఒడుపు చూసి, మీరు డాక్టరయితే పళ్ళు యమ పీకుడు పీకుతారన్న నమ్మకంతో వుండేవారు మా వాళ్ళు. ఇవన్నీ అనవసరం. ఈ సంక్రాంతికైనా ఓ అయిదువేల పట్టుచీర కొనిపెట్టండి".

"నాలుగేళ్ళబట్టి ఈ పట్టుచీర గొడవే!" ఈ శ్రీమతేందిరో! ఈ పీకుడేందిరో!" అని అప్పుచేసి ఓ పట్టుచీర కొనిచ్చారు డాక్టర్ గారు.

అప్పుచేసిన విషయం తెలియని ఆయన శ్రీమతి ప్రాక్టీస్ ఊపందుకున్నట్లుంది, ఇక ఈపైన పీకుడే పీకుడు అనుకుని సంతోషించింది.